క్లుప్తంగా

అమ్మవార్ల ఉత్సవాలకు రాట ముహూర్తం



రాటముహూర్తంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నేత శ్రీకృష్ణ

మండపేట: పట్టణంలోని గాంధీనగర్‌లో వేంచేసిన వడ్డిపోలమ్మ, కుంచాలమ్మ అమ్మవార్ల ఉత్సవాలకు శుక్రవారం రెల్లి యూత్ ఆధ్వర్యంలో రాట ముహూర్తం చేశారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం నియోజకవర్గ కన్వీనర్ చోడే శ్రీకృష్ణ పాల్గొని అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ కమిటీ సభ్యులు శ్రీకృష్ణకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ నెల 29వ తేదీ నుంచి తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు మీసాల శ్రీను, ముత్యాల నాగేశ్వరరావు, బంగారు రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కాజులూరు: కాజులూరులో ఈ నెల 22వ తేదీ శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ జె.రాంబాబు తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఎంపీపీ మాత భారతి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మండల గ్రామాల్లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపైన సభ్యులు, అధికారులు చర్చిస్తారన్నారు. మండల గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు స్థానిక సంస్థల ప్రతినిధులు, అన్ని శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా పాల్గొన్నాలన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

మండపేట: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మండపేట అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జిల్లా విద్యుత్ శాఖ అధికారి సిద్దెల రాజబాబు శుక్రవారం ఓ ప్రకటన తెలిపారు. 132 కేవీతో పాటు 33, 11 కేవీ లైన్ల మరమ్మతుల పనులు చేస్తున్నందున ఆలమూరు, తాపేశ్వరం, ఏడిద, మండపేట సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఆలమూరు, చొప్పెళ్ల, మండపేట, గొల్లపుంత కాలనీ, తాపేశ్వరం, ఏడిద సీతానగరం, ఏడిద కొత్తూరు, ఏడిద సావరం, ఇప్పనపాడు అర్తమూరు, వెలగతోడు, మెరిపాడు, మారేడుబాక గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతోందన్నారు. ఈ విషయాన్ని గమనించి ప్రజలు, వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

23న ఆర్యవైశ్య వధూవరుల పరిచయ వేదిక

మండపేట: పి.గన్నవరం మండలం చాకలిపాలెంలో ఈ నెల 23న ఆర్యవైశ్య వధూవరుల పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్టు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వాసవీ సేవాదళ్ కమిటీ చైర్మన్ గొల్లపూడి లక్ష్మీనారాయణ వెల్లడించారు. మండలంలోని కేశవరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం స్థానిక శ్రీకృష్ణబాలాజీ ఫంక్షన్ హాలులో పరిచయ వేదిక ఏర్పాటు చేశామన్నారు. ఆర్యవైశ్య వధూవరుల పరిచయ వేదిక జిల్లా సంఘ అధ్యక్షుడు కంచర్ల బాబి ఆధ్వర్యంలో అందరికీ మంచి చేయాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆర్యవైశ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సంఘ ప్రధాన కార్యదర్శి పేరూరు రమేష్, కోశాధికారి మాతంశెట్టి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలి



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు

కాజులూరు: పౌష్టికాహారం, పరిసరాల శుభ్రతపై అంగన్‌వాడీ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని తాళ్లరేవు ఐసీడీఎస్ సీడీపీఓ వి.మాధవి అన్నారు. కాజులూరులో గత రెండు రోజులుగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పి.కనకరత్నం, ఎస్‌బీ మాణిక్యాంబ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. శుక్రవారం ఆమె మాట్లాడుతూ సమతుల ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై పిల్లలకు, పిల్లల తల్లులకు ఏ విధంగా శిక్షణ ఇవ్వాలో వివరించారు.

శివారుకు అందని సాగునీరు

- తడారిపోతున్న వరిపొలాలు
- రైతుల ఆందోళన



గొల్లపాలెంలో ఎండిపోతున్న వరిపొలంలో రైతుల ఆందోళన



కాజులూరులో పంటకాలువలో ఊటనీటిని గుల్లతో పొలానికి తోడుతున్న రైతు

కాజులూరు: కాలువల్లో నీరు అడుగంటిపోతున్నాయి. ఎగువ నుంచి వచ్చే కొద్దిపాటి నీరు కాలువ శివారు భూములకు చేరడం లేదు. దీంతో తూర్పుడెల్టాలోని కాలువ శివారు భూములకు చుక్కనీరు రావడం కష్టంగా మారడంతో బీటలు వారుతున్న పొలాలను చూసి రైతులు కన్నీటిపర్యంతమౌతున్నారు. దమ్ము చేసి నారుపోసి ఎరువులు వేసి ఏపుగా పెంచిన పంట నీటి తడికి నోచుకోక ఎండిపోతుండటంతో చివరకు రైతులు ఆందోళనలకు గురవుతున్నారు. కాజులూరు మండలంలోని పలు గ్రామాల్లో నీరందక పొలాలు ఎండిపోతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలోని శలపాక నుంచి కొంగోడు వెళ్లే కాలువపై డేగలపేట, గొల్లపాలెం గ్రామాల పరిధిలో సుమారు 200 ఎకరాలకు సాగునీరందక పొలాలు బీటలు వారుతున్నాయి. ఇక్కడ పొలాలకు కోరంగి కెనాల్ నుంచి మంజేరు, శలపాకల మీదుగా సాగునీరు విడుదల కావలసి ఉంది. అయితే ఎగువ ప్రాంతం నుంచి నీటి విడుదల తక్కువగా ఉండటం వచ్చే కొద్దిపాటి నీరు ఎగువ ప్రాంతం రైతులు పంట పొలాల్లో ఆయిల్ ఇంజిన్లు వేసి అనధికారికంగా నీరు తొడేస్తుండటంతో ఈ కాలువ శివారు భూములకు చుక్కనీరు రావటం గగనమౌతుంది. దీంతో రైతులు నీటిగుల్ల సహాయంతో పిల్ల కాలువల్లోని నీటిని పొలాలకు తోడుకోవలసి వస్తుంది. మెరక పొలాల్లో నీటితడి లేక బీటలు వారుతున్న పొలాలను చూసి రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలోని గొల్లపాలెం శివారు చీకట్లవారిపేట, బందనపూడి శివారు మొగలిపాలెం, కాలువకు కరప మండలం వేళంగి



ఆర్యావటంలో తడి ఆరిపోయిన వరిపొలం

మీదుగా వచ్చే తుమ్మలపల్లిలంక కాలువపై ఉన్న ఆర్యావటం, తుమ్మలపల్లి, శిరిగలవారిపల్లిలంక గ్రామాలతోనూ పొలాలకు దాదాపు ఇదే పరిస్థితి కొనసాగుతుంది. మండల గ్రామాల్లో ప్రస్తుతం వరి పంట చిరుపొట్ట దశ నుంచి ఈనికదశలో ఉంది. అయితే సాగునీరు లేక పొలాల్లో తడి ఆరిపోతుండటంతో పంట ఈనిక జరగటం లేదని నీరులేక మొక్క గిడస బారిపోతుందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే ఎకరానికి రూ.30 వేలు వరకూ పెట్టుబడి పెట్టామని ఆశ చావక ఇకపై సాగు ముందుకు సాగినా పెట్టుబడి పెరుగుతుందే తప్ప ఇలితం ఉంటుందన్న పరిస్థితులు కనిపించడం లేదని రైతులు అంటున్నారు. కాలువ శివారు భూముల్లో ఏర్పడ్డ నీటి ఎద్దడిపై నీటిసంఘాల అధ్యక్షులకు, అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. పంట సాగుచేసే మొదటి రోజుల్లోనే సాగునీరు ఇవ్వలేమని అధికారులు, నాయకులు తేల్చిచెప్పి ఉంటే తమకు ఈ దుస్థితి ఉండేది కాదని కాలువ శివారు భూముల్లో సాగు మానేసేవారమని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి సాగునీరు అందేలా చూస్తే అవకాశం ఉన్నంత వరకూ పంటలు రక్షించుకుంటామని రైతులు కోరుతున్నారు.

తీవ్రంగా నష్టపోతున్నాం



దాళ్వాకు సాగునీరు విడుదల విషయంపై అధికారులు, నాయకులు నిర్దిష్టమైన సమాచారం ఇవ్వలేదు. మొదట్లో సాగునీరు బాగానే వస్తుండటంతో పంట వేశాను. నీరు లేక పొలం ఎండిపోతుంది. త్వరలో నీరు వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఎండిపోయిన పొలానికి నీరుపెట్టి ఏంటి లాభం.

– దంగేటి వెంకన్న, రైతు, గొల్లపాలెం

శివారు భూములకు ప్రాధాన్యమివ్వాలి



పంట కాలువలలో ఎగువ ప్రాంత రైతులు ఆయిల్ ఇంజిన్లతో నీరు తోడకుండా అధికారులు నిరోధించాలి. వంతుల వారీ విధానంతో ఎగువ ప్రాంతం రైతులకు కొన్ని రోజులు, కాలువ శివారు రైతులకు కొన్ని రోజులు కేటాయించి అందరికి సమన్యాయం చేయాలి

– కేశన వీర్రాజు, రైతు, అంద్రంగి

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన అవసరం

కపిలేశ్వరపురం: క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్స్ (పీఎంపీ)లకు అవగాహన అవసరమని శస్త్ర చికిత్స వైద్య నిపుణులు అన్నారు. అంగరలో శుక్రవారం మండల కమ్యూనిటీ పారామెడిక్స్– ప్రైమరీ హెల్త్ కేర్ ప్రావైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీఎంపీ అసోసియేషన్) సమావేశం జరిగింది. ఆ సంఘ రాష్ట్ర రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగుమళ్ల రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో పలువురు శస్త్ర చికిత్స నిపుణులు వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. సదస్సు నిర్వాహకులను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకర రావు అభినందించారు. రాజమహేంద్రవరం డెల్టా ఆసుపత్రికి చెందిన శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ రిమ్మలపూడి నితిన్, గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ వి.జీవన్, ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ కె.నాగేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి చికిత్సకు అధునాతన పద్ధతులు అందుబాటులోకి వచ్చాయన్నారు. వెరికోసిస్, పైల్స్, హెమరాయిడ్స్ వ్యాధులకు చేసే లేజర్ చికిత్స విధానాన్ని సాంకేతిక పరికరాల సాయంతో వివరించారు.



అంగరలో శస్త్ర చికిత్స నిపుణులను సత్కరిస్తున్న పీఎంపీ వైద్యులు

ప్రజల జీవన శైలిలో రావాల్సిన మార్పులపై అవగాహన కల్పించాలన్నారు. వక్తలను అసోసియేషన్ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు అడ్డాల శ్రీనివాస్, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోన సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి సూరంపూడి వీరభద్రరావు, కోశాధికారి మట్టా వీరబాబు, తూర్పు గోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బళ్లా శ్రీనివాసరావు, పి.దేవానందం, తోరం రాము పాల్గొన్నారు.

పీడితులకు అండగా కవిత్వం

మండపేట: కవిత్వం అంటే భావాల వెల్లడి మాత్రమే కాదని, పీడితులకు అండగా ఉండే కవిత్వమే శాశ్వతంగా నిలుస్తుందని సాహితీ గోదావరి అధ్యక్షులు డాక్టర్ ర్యాలి శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అభ్యుదయ రచయితల సంఘం, మండపేట సంగమం సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో డాక్టర్ చల్లా రవికుమార్ అధ్యక్షతన శుక్రవారం అన్నపూర్ణ హైస్కూల్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అరసం జిల్లా అధ్యక్షులు గండి స్వామి ప్రసాద్ స్వాగత వచనాలు పలికారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులు తమ కవితలను వినిపించారు. సమాజం ఎదుర్కొంటున్న వివిధ సామాజిక అంశాలపై కవులు వినిపించిన కవితలు ఆహూతులను అలరించాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా ప్రముఖ కవి సామాజికవేత్త



సదస్సులో మాట్లాడుతున్న సాహితీవేత్త డాక్టర్ చల్లా రవికుమార్

మేకా గౌరవ్, డాక్టర్ ర్యాలీ శ్రీనివాస్ వ్యవహరించారు. కార్యక్రమంలో విద్యావేత్త వల్లూరు సత్యనారాయణ చౌదరి, కళామిత్ర మీరాబి, ప్రముఖ కవులు గొడవర్తి శ్రీనివాస్, ఆర్‌వీవీ రాజా, శ్రీనివాసచార్యులు, అవసరాల మాధవరావు, వినకోటి రాజేష్ కుమార్, కల్లూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రంగారావు

మండపేట: పట్టణ ప్రజలకు వివిధ రకాల ఆహార పదార్థాలను అందించే హోటల్స్ నిర్వాహకులు నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు ఆదేశించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా నిబంధనలు కఠినతరం చేస్తున్నామన్నారు. పట్టణంలోని హోటల్స్, టీ స్టాల్ నిర్వాహకులతో శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని ఆయన సమావేశం నిర్వహించారు. హోటల్స్ యజమానులకు పలు ఆదేశాలు జారీ చేశారు. పట్టణంలో ప్లాస్టిక్ నిషేధం అమల్లో ఉందన్నారు. ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు వాడవద్దన్నారు. హోటల్స్ యజమానులు పాతకాలపు సాంప్రదాయాన్ని పాటించి టిఫిన్ ప్లేట్లలో, అరటి ఆకుల్లో అందించాలని సూచించారు. ఇక నుంచి ప్రతి హోటల్ వద్ద గాజు గ్లాసులు, పింగాణీ కప్పులు, స్టీల్ గ్లాసులు వాడాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, వార్డు శానిటేషన్ కార్యదర్శులు, హోటల్స్ యజమానులు పాల్గొన్నారు.

న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

రామచంద్రపురం: రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి ఏఆర్‌టీ సెంటర్‌లో చికిత్స పొందుతున్న 38 మంది హెచ్ఐవీ బాధిత చిన్నారులకు తాళ్లరేవుకు చెందిన స్వచ్ఛంద సంస్థ భీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. బియ్యం, చోడిపిండి, గోధుమ పిండి, గోధుమ రవ్వ, బెల్లం, కందిపప్పు, వేరుశనగ గుళ్లు, ఇడ్లీ రవ్వ మొత్తం 9 రకాల పోషకాహారాలతో కూడిన కిట్లు సంస్థ అధ్యక్షురాలు వి.నందివర్ధన చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ శేఖర్, ఏఆర్‌టీ సెంటర్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, సంస్థ సిబ్బంది డి.అర్జునరావు, జి.చంద్రకళ, లోవకుమారి, ధనలక్ష్మి, అనిత, నూకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



హెచ్ఐవీ బాధిత చిన్నారులకు న్యూట్రిషన్ కిట్లు అందజేస్తున్న నందివర్ధన

ఎరువులు, పురుగుమందుల వాడకంపై చైతన్యం రావాలి

రామచంద్రపురం రూరల్: వరి సేద్యంలో యాంత్రీకరణ ద్వారా నూతన విధానాలు పాటించడంతో పాటు ఎరువులు, పురుగుమందుల వినియోగం తగ్గించేలా రైతుల్లో చైతన్యం రావాలని రామచంద్రపురం డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు ఏవీఎస్ రంగారావు అన్నారు. మండలంలోని వెల్ల గ్రామంలో మండల వ్యవసాయాధికారి ఎస్.సత్యప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మేలైన వ్యవసాయ పద్ధతులు పాటించి తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించేలా చేయడమే పొలంబడి కార్యక్రమం లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఏఓ సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణం దృష్ట్యా రైతులు పంటలకు చీడపీడలు ఆశించకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, గ్రామ వ్యవసాయ సహాయకుడు పి.సత్యనారాయణ, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



పొలంబడిలో పాల్గొన్న ఏడీఏ రంగారావు తదితరులు

ఎస్సీ వర్గీకరణపై విజయోత్సవాలు

మండపేట: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ సాగించిన మూడున్నర దశాబ్దాల సుదీర్ఘ పోరాట ఫలితంగా మాదిగలు, మాదిగ ఉపకులాలు రిజర్వేషన్ ఫలాలు అందుకునే సమయం ఆసన్నమైందని ఎమ్మార్పీఎస్ నాయకుడు దూలపల్లి సుబ్బారావు అన్నారు. మండపేటలో శుక్రవారం ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. రాష్ట్ర నాయకుడు దూలి జయరాజు నేతృత్వంలో జరిగిన వేడుకల్లో ఎస్సీ నాయకులు సుబ్బారావు, గాలింకి జాన్‌మోసే, కొత్తపల్లి ప్రసాద్, పెనుమాక షాలెంరాజు, పలివెల లోవరాజు తదితరులు పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసి మాట నిలుపుకున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ప్రధాని మోదీలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పెందుర్తి కిషోర్, పెందుర్తి ప్రదీప్‌కుమార్, మందపల్లి దొరబాబు, మోరంపూడి సూరిబాబు, గాలింకి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మండపేటలో విజయోత్సవాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



కపిలేశ్వరపురంలో ప్రకృతి సాగు ప్రణాళికను వివరిస్తున్న ఏఓ రమేష్‌కుమార్

కపిలేశ్వరపురం: ప్రకృతి సాగుతో ఆరోగ్యవంతమైన దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏపీ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్, డీఆర్‌డీఏ, వ్యవసాయ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయా శాఖల అధికారులు కేవీఎస్ రమేష్‌కుమార్, స్వర్ణలత, అనంత్‌కుమార్ మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం చేసేవారిని ప్రోత్సహించేందుకు 36 రకాల విత్తనాలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. రానున్న ఖరీఫ్ నాటికి అవసరమైన ఆచరణాత్మక ప్రణాళికను వివరించారు. సమావేశంలో వ్యవసాయ, ఉద్యాన శాఖల సచివాలయ సహాయకులు, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు సరిచేసిన అధికారులు

సాక్షి ఇంపాక్ట్

రామచంద్రపురం: 'ప్రమాదకరంగా విద్యుత్ తీగలు' అంటూ ఈనెల 19న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించారు. బైపాస్ రోడ్డులోని కొత్తూరు జంక్షన్ సమీపంలో రోడ్డును అనుకుని పంట పొలాల్లో ఉన్న విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి తీగలు ప్రమాదకరంగా వేలాడుతుండటాన్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకువచ్చింది. ఏపీఈపీడీసీఎల్ ఈఈ రత్నాలరావు స్పందించి ఆయన ఆదేశాల మేరకు ఏఈ ఎంవీ రమణ ఆధ్వర్యంలో లైన్‌మన్ అశోక్, ఇతర సిబ్బంది విద్యుత్ తీగలను సరిచేశారు. స్తంభాలకు ఆనుకుని ఉన్న తుప్పలను తొలగించారు. ఈ మేరకు పంట పొలాల్లో రైతులకు ఎటువంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో చుట్టుపక్కల రైతులు, స్థానికులు సంతృప్తి వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.



ప్రమాదాన్ని నివారించేందుకు సవరించిన విద్యుత్ తీగలు

రోడ్డు ప్రమాదంలో మోటార్ సైక్లిస్ట్ మృతి

రాయవరం: మండలంలోని మాచవరం –పసలపూడి గ్రామాల మధ్య జరిగిన రహదారి ప్రమాదంలో మోటార్ సైక్లిస్ట్ మృతి చెందాడు. రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం..మండపేట మండలం ఏడిద గ్రామానికి చెందిన చొక్కా సతీష్(35) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాకినాడలోని చికెన్ షాపులో పనిచేస్తున్న సతీష్ ఏడిదలో ఉన్న తల్లిదండ్రులను చూసేందుకు వచ్చాడు. తిరిగి కాకినాడ వెళ్తుండగా, శుక్రవారం వేకువజామున ప్రమాదానికి గురయ్యాడు. తాను ప్రయాణిస్తున్న మోటార్ సైకిల్‌తో సైక్లిస్టును ఢీకొని రోడ్డుపై పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో ఘటనా స్థలిలోనే మృతి చెందినట్లు ఎస్సై సురేష్‌బాబు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్‌బాబు తెలిపారు.



చొక్కా సతీష్ (ఫైల్)

కోర్టు ప్రాంగణంలో ఆర్వో ప్యూరిఫయర్ ప్రారంభం



కోర్టు ప్రాంగణంలో ఆర్వో ప్యూరిఫయర్‌ను ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి శంకరరావు

రామచంద్రపురం: పట్టణంలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో శుక్రవారం 13 అడిషనల్ జిల్లా, సెషన్స్ జడ్జి ఎం.శంకరరావు ఆర్వో ప్యూరిఫయర్‌ను స్విచాన్ చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా కక్షిదారుల దాహార్తి తీర్చేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఆర్వో ప్యూరిఫయర్‌ను ఏర్పాటు చేసిన బ్యాంక్ బరోడా చీఫ్ మేనేజర్ అరుణను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్ జడ్జి నిజాం శారద, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పిల్లి మురళీమోహన్ వెంకటరమణ, వాడ్రేవు సాయిప్రసాద్, ఉపాధ్యక్షుడు పలివెల సత్యనారాయణ, జూనియర్ల ప్రతినిధి పిల్లా పృథ్వీ, ఎన్వీ శేషుకుమార్, మూడు కోర్టుల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

మండపేట: నియోజకవర్గంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. మండపేట అర్బన్, రూరల్ ప్రాంతాల్లో శుక్రవారం నిర్వహించిన ఇంగ్లిషు పరీక్షకు మొత్తం 1884 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1814 మంది హాజరైనట్టు మండల విద్యాశాఖ అధికారి నాయుడు రామచంద్రరావు తెలిపారు. నలుగురు విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని చెప్పారు. కాగా తాపేశ్వరం, ద్వారపూడి, ఏడిద, మండపేటలోని పరీక్ష కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగాయి. ఎండలను దృష్టిలో పెట్టుకుని అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

మనవళ్లను చూసి.. మురిసిపోయి..

మండపేట: నాలుగేళ్ల నుంచి వరకట్న వేధింపుల కేసులో భర్త, అత్త, మామల కోర్టు వాయిదాలకు తిరుగుతున్న పైడిముక్కల జానకీదేవి తన మనవళ్లను చూపించాలని ఆలమూరు కోర్టు న్యాయమూర్తిని లోక్ అదాలత్‌లో కోరింది. కాగా ఆమె కోర్కెను తీర్చాలని న్యాయమూర్తి నాగేశ్వరనాయక్ ఆదేశించారు. దీంతో భర్త, అత్తమామలపై వేధింపుల కేసు పెట్టిన బాధితురాలు పైడిముక్కల రాణి శుక్రవారం ఇద్దరి పిల్లలను తీసుకుని కోర్టుకు వచ్చింది. తన మనవళ్ల ఇద్దరినీ చూసి నాయినమ్మ మురిసిపోయింది. ఆనందంతో వారిని ముద్దాడింది. ఈ విషయంలో తనకెంతో సంతోషంగా ఉందంటూ నిందితురాలు జానకీ దేవి న్యాయమూర్తికి ధన్యవాదాలు తెలిపినట్టు సీఐ దారం సురేష్ తెలిపారు.

గల్ఫ్ పంపిస్తానంటూ మోసం

రామచంద్రపురం రూరల్: గల్ఫ్ పంపిస్తానంటూ నమ్మించి పలు దఫాలుగా తన వద్ద నుంచి సొమ్ములు వసూలు చేసి మోసం చేశాడని హైదరాబాద్‌కు చెందిన పిల్లా నవీన్ అనే వ్యక్తిపై మండలంలోని ద్రాక్షారామ నున్న వారి వీధికి చెందిన సిర్రా రాజ్యలక్ష్మి ద్రాక్షారామ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. గల్ఫ్ పంపిస్తానంటే 2024 సెప్టెంబరులో నవీన్‌కు మూడు దఫాలుగా ఫోన్ పే ద్వారా రూ.లక్ష పంపించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను గల్ఫ్ వెళ్లడానికి వీసా ఇవ్వకపోగా, చెల్లించిన సొమ్ములు కూడా వాపసు ఇవ్వకపోవడంతో మోసపోయానని గుర్తించి ఫిర్యాదు చేయగా ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భారీ కణితి తొలగింపు

రామచంద్రపురం: స్థానిక ఏరియా ఆసుపత్రిలో వైద్యులు శుక్రవారం ఒక వృద్ధుడి కాలి నుంచి శస్త్ర చికిత్స నిర్వహించి భారీ కణితిని తొలగించారు. ఆలమూరు మండలం దుళ్ల శివారు మల్లవాని తోటకు చెందిన 70 ఏళ్ల వృద్ధుడు చెల్లుబోయిన సత్యనారాయణ కుడి కాలు మోచిప్ప వద్ద పెరిగిన భారీ కణితిని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ప్రవీణ్, డాక్టర్ కల్యాణ్‌బాబులు శస్త్ర చికిత్స చేసి విజయవంతంగా తొలగించారు. దీంతో వృద్ధుని కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేసి వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలోని పెద్ద ఆసుపత్రులకు పంపించి వేయకుండా పేదలకు అందుబాటులోని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి వద్ద శస్త్ర చికిత్స చేసిన వైద్యులను పలువురు అభినందించారు.

మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి

రామచంద్రపురం: మతసామరస్యానికి, సమాజంలో సమానత్వం, శాంతి కోసం ఇఫ్తార్ విందులు దోహదపడతాయని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రామచంద్రపురంలోని శుక్రవారం చిన్న మసీదు, పెద్ద మసీదులో జరిగిన ఇఫ్తార్ విందులో ముస్లింలతో కలిసి మంత్రి సుభాష్ పాల్గొన్నారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం నిస్తోందన్నారు. ముస్లింలకు రంజాన్ పర్వదినాలు ఎంతో ప్రాముఖ్యమైనవని, ఉపవాస దీక్ష అనేది కేవలం అల్లా అనుగ్రహం కోసమే కాదని, సమాజంలో సోదర భావం, ఐకమత్యం, దయాగుణం, ప్రేమ పెంపొందించేందుకు దోహదపడతాయన్నారు. లోక శాంతి కోసం ముస్లింలంతా అల్లాకు ప్రార్థనలు చేయాలని కోరారు. మంత్రి సుభాష్‌ను ముస్లిం పెద్దలు ఘనంగా సత్కరించారు. పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.